BHARATH SAMACHAR DIGITAL

11, సెప్టెంబర్ 2026, శుక్రవారం

భారత్ సమాచార్

# మెండోరాలో అంగన్వాడీల ఆధ్వర్యంలో ఘనంగా పోషణ మాసం



**భారత్ సమాచార్, నిజామాబాద్ జిల్లా:** మెండోరా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు, బాలింతలు మరియు చిన్నారుల కోసం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఏసీడీపీఓ స్వర్ణలత ముఖ్య అతిథిగా హాజరై గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు.

ఈ సందర్భంగా గర్భిణీలకు పండ్లు, పూలు, గాజులు అందించి సంప్రదాయబద్ధంగా శ్రీమంతం నిర్వహించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, పోషక విలువలు కలిగిన పదార్థాల వినియోగం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే శిశువులు ఆరోగ్యంగా జన్మిస్తారని, గర్భిణీలు వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించి వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తును ఆకాంక్షించారు. బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అధికారులు తెలిపారు. చిన్నారులకు సమయానికి పౌష్టికాహారం అందించడం, పరిశుభ్రమైన వాతావరణంలో పెంచడం ద్వారా ఆరోగ్యకరమైన తరాన్ని తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. పోషణ మాసం ఉద్దేశాలను ప్రతి కుటుంబానికి చేరేలా అంగన్వాడీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి. ప్రమోద్ కుమార్, సూపర్‌వైజర్లు అనురాధ, మాధవి, ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు సుజాత, మంజు, సుష్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అలాగే గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తల్లులు, చిన్నారుల ఆరోగ్యం, పోషణపై నిరంతరం అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

© 2026 Bharath Samachar